క్లుప్తంగా

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సదుం: స్థానిక ఎంజేపీ బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్ బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి గురువారం తెలిపారు. 2024 సంవత్సరం పదవ తరగతి ఉత్తీర్ణులైన బాలురు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పదవ తరగతి తాత్కాలిక మార్కుల లిస్ట్, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రంతో ఎంచుకున్న గ్రూపులకు ఈనెల 27 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మెరిట్ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తామన్నారు.

డ్రైనేజీ నీటిని అడ్డుకుంటున్నారని ఫిర్యాదు



పందేరుపల్లెలోని మురుగునీరు వెళ్లే కాలువ

పలమనేరు: తమ గ్రామంలో 30 ఏళ్లుగా ఉన్న మురుగు కాలువలో నీటిని వెళ్లనీయకుండా కొందరు అడ్డుకుంటున్నారని పలువురు పందేరుపల్లె గ్రామస్తులు గురువారం పంచాయతీ కార్యదర్శి మదన్‌కు ఫిర్యాదు చేశారు. మండలంలోని జరావారిపల్లె పంచాయతీ పందేరుపల్లెలో ఇళ్ల నుంచి వెలువడే వృథా నీరు వెళ్లే మార్గం ప్రభుత్వానికి సంబంధించిన భూమి. ఈ మార్గంలో దశాబ్దాలుగా మురుగునీరు వెళుతోంది. ఇటీవల గ్రామంలో స్థలం కొన్న ఓ వ్యక్తి ఆ నీటిని వెళ్లకుండా అడ్డుకోవడంతో సమస్య తలెత్తింది. దీనిపై పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ, ప్రస్తుతం డ్రైనేజీ వెళుతున్న చోట కొత్తగా డ్రైన్ కూడా మంజూరైందని తెలిపారు. దీన్ని అడ్డుకున్న వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి సమస్యను పరిష్కరించనున్నట్టు తెలిపారు.

27న గంగ జాతర

వి.కోట: ఈ నెల 27, 28వ తేదీలలో స్థానికంగా గంగమాంబ జాతర నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కార్తికేయన్ గురువారం తెలిపారు. దీనికి సంబంధించి ఈ నెల 20న మంగళవారం చాటింపు చేశారు. 26న ఆదివారం అంకురార్పణ, 27న ఉదయం అభిషేకం, రాత్రి శిరస్సు, పూలగెరిగ, పుష్పపల్లకి నిర్వహిస్తారు. 28 ఉదయం 6 గంటలకు అగ్నిగుండ ప్రవేశం, అమ్మవారికి అభిషేకానంతరం రాత్రి 9 గంటల వరకు దీపారాధన, అలాగే 12 గంటలకు అమ్మవారి జలధి కార్యక్రమం ఉంటుందని వివరించారు. 28న సాయంత్రం 5 గంటలకు మాజీ సర్పంచ్ బసప్ప జ్ఞాపకార్థం ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది.

వీరబ్రహ్మేంద్రస్వామి వార్షికోత్సవ పూజలు



బొమ్మాయిపల్లెలో విశేషాలంకారంలో గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామి

బంగారుపాళెం: మండలంలోని బొమ్మాయిపల్లెలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో గురువారం వార్షిక పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు వార్షిక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం కలశస్థాపన, గణపతిపూజ, గణపతిహోమం, రక్షాబంధనం, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామి మూలవరులకు ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. స్వామి, అమ్మవారిని విశేషంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అర్ధగిరి క్షేత్రంలో ఘనంగా బుద్ధ పౌర్ణమి

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో గురువారం పౌర్ణమి వేడులకు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామికి అభిషేకం, పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యం సమర్పించారు. అనంతరం వివిధ రాష్ట్రాల భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

బుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని ఆలయంలోని మండపంలో అర్చకులు స్వామికి సుదర్శన హోమం చేశారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి ప్రాకారోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తుల కాలక్షేపం కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ హనుమంతురావు పర్యవేక్షించారు.

వేలంలో రూ.5.55 లక్షల ఆదాయం

వేలంలో రూ.5.55 లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ హనుమంతురావు తెలిపారు. ఎండోమెంట్ అధికారి సుమనప్రియ ఆధ్వర్యంలో వేలం నిర్వహించినట్లు పేర్కొన్నారు.

విత్తనోత్సాహం

- అదునుకు ముందుగానే పంపిణీ
- ఆర్బీకేల వద్ద రైతుల సందడి
- పంట సాగు చేసి జియో ట్యాగింగ్ చేయాలన్న అధికారులు



రొంపిచెర్ల: వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు



బైరెడ్డిపల్లె : వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

పలమనేరు: అదునుకు ముందుగానే ప్రభుత్వం ఈ పర్యాయం వేరుశనగ విత్తనాలను రైతులకు అందజేస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ విద్యాసాగర్, వ్యవసాయాధికారిణి సంధ్య కోరారు. మండలంలోని ఆయా రైతు భరోసా కేంద్రాలలో గురువారం సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను పంపిణీ ప్రారంభించారు. స్థానిక ఏడీ కార్యాలయం వద్ద ఎంపీడీఓ, ఏఓ పంపిణీ చేసి మాట్లాడారు. 30 కిలోల బస్తా విత్తన కాయలను పూర్తి ధర రూ.2850 కాగా వీటిని ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ(1140)తో రూ.1710లకే ఇస్తోందన్నారు. ఈసారి బెట్టను తట్టుకునే కదిరి-6 ,టీసీజీఎస్ 1694 రకాలను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతానికి 12 ఆర్బీకేలకు 1035 క్వింటాళ్ల విత్తనకాయలు అందాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వై.రంగనాయకులు, ఆర్బీకేల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండలంలోని 5,300 మంది రైతులకు 18 ఆర్బీకేల ద్వారా 1600 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు గురువారం పంపిణీ చేసినట్లు వ్యవసాయాధికారి రభీబా తెలిపారు. మిగిలిన 380 క్వింటాళ్ల కాయలను రెండు మూడు రోజుల్లో రైతులకు ఇస్తామన్నారు. సాగు చేసిన వేరుశనగ పంటను ఆర్బీకే సిబ్బంది వద్ద ఈ-క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు. ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దపంజాణి ఆర్‌బీకేలో విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్న ఏఓ రభీబా

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో గురువారం సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేసినట్లు వ్యవసాయశాఖ అధికారిణి గీతాకుమారి తెలిపారు. 1,674 మంది రైతులు ఇప్పటివరకు విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వీరిలో 1320 మందికి పంపిణీ చేసినట్టు చెప్పారు. మండలంలోని రైతులకు 2015 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ రాజేష్, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: పుంగనూరు మండలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న 3 వేల మంది రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ గురువారం ప్రారంభించినట్లు ఏఓ రాజేష్ తెలిపారు. మండలంలోని 11 ఆర్బీకేలలో పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ కార్యదర్శులతో తొలివిడతలో 600 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ పంపిణీ చేసినట్లు చెప్పారు.

సదుంలో..

సదుం: మండలంలో వేరుశనగ విత్తన కాయల పంపిణీని గురువారం నుంచి ప్రారంభించినట్లు ఏఓ హరిప్రసాద్ తెలిపారు. మొదటి రోజు 1,272 మంది రైతులకు కదిరి రకం 497 క్వింటాళ్లు, నారాయణి రకం 75.6 క్వింటాళ్లు పంపిణీ చేసినట్లు చెప్పారు.

పులిచెర్ల మండలంలో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలో గురువారం 13 రైతు భరోసా కేంద్రాలలో గురువారం వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేసినట్లు ఏఓ ఏఓ శ్రీనివాసులు తెలిపారు.వేరుశనగ పంట సాగు చేసే రైతులు ఎకరాకు 100 కిలోల సూపర్ ఫాస్పేట్ దుక్కిలో వేయాలన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: మండలానికి 1,104 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ కాయలు వచ్చాయని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన రొంపిచెర్లలో వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేసి మాట్లాడారు. ఒక ఇంట్లో ఒక రైతుకు మాత్రమే సబ్సిడీ విత్తనాలు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్బీకే ఇన్‌చార్జిలు వెంకటరమణ నాయక్, సుజాత, నరసింహులు, సుబ్రమణ్యం, శ్రావణి, సుబ్రమణ్యం, రేఖ తదితరులు పాల్గొన్నారు.







కుప్పం రూరల్: వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ, గుడుపల్లె: పంపిణీ చేస్తున్న ఏఓ నాగరాజు, రామకుప్పం: పంపిణీ చేస్తున్న తహసీల్దార్ శ్రీధర్

కుప్పం నియోజకవర్గం

కుప్పం రూరల్: కుప్పం మండలంలో గురువారం 680 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసినట్లు వ్యవసాయాధికారి అమృతవల్లి చెప్పారు. 24 ఆర్బీకేలలో 1514 మంది రైతులకు వీటిని ఇచ్చినట్లు చెప్పారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, రూ. 1710 తెచ్చుకోవాలని సూచించారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: మండలంలోని రైతు భరోసా కేంద్రాలలో రైతులకు వేరుశనగకాయలు విత్తనాలను వ్యవసాయాధికారి నాగరాజు పంపిణీ చేశారు. రైతులు పంట సాగు చేసిన తరువాత జియో ట్యాగింగ్ చేయాలని, ఒకవేళ ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే పరిహారం పొందడానికి వీలవుతుందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డి శంకర్, రైతులు పాల్గొన్నారు.

రామకుప్పంలో..

రామకుప్పం: రామకుప్పంలో గురువారం తహసీల్దార్ శ్రీధర్,ఎంపీడీఓ ఈశ్వరన్న రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసి మాట్లాడారు. విత్తన కాయలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయాధికారి అమృత, సిబ్బంది ఆనంద్, యువరాజు పాల్గొన్నారు.









పలమనేరు: వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ, ఏఓ, పుంగనూరు: వనమలదిన్నెలో విత్తనాలు పంపిణీ చేస్తున్న సెక్రటరీ పద్మనాభరెడ్డి, సదుం: విత్తన కాయలు పంపిణీ చేస్తున్న అధికారులు, పులిచెర్ల: మతుకువారిపల్లెలో పంపిణీ చేస్తున్న ఏఓ

పెట్రో, టపాసుల దుకాణాలపై దాడులు

- బంకుల్లో బాటిళ్లలో ఆయిల్ పట్టొద్దు
- పలు అనధికారిక దుకాణాల్లో పెట్రోల్ సీజ్
- ఎన్నికల ఫలితాల రోజున టపాకాయలు కాల్చొద్దు

పలమనేరు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ అధికారులు మండలంతో పాటు పట్టణంలో పెట్రోలు బంకులు, అనధికారికంగా పెట్రోలు విక్రయించేవారు, టపాకాయల విక్రేతలపై గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పలు పెట్రోల్ బంకులో బాటిళ్లలో పెట్రోలు నింపుతున్న వారికి నోటీసులు జారీ చేశారు. మండంలోని మొరం పంచాయతీలో రోడ్డుపక్కన పెట్రోల్ అమ్ముతున్న నలుగురి వద్ద 160 లీటర్ల పెట్రోల్‌ను సీజ్ చేసి వారిపై కేసులకు సిఫారసు చేశారు. రూరల్ మండలంలోని జల్లిపేట వద్ద టపాకాయలు విక్రయించే గోడౌన్ నిర్వాహకులు హెచ్చరికలు జారీ చేశారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో టపాకాయలు కాల్చడం, విజయోత్సవ ర్యాలీలు, గుంపులుగా జనం ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో డీటీ రిషి, సిబ్బంది పాల్గొన్నారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: దుకాణాలలో పెట్రోలు, డీజిల్ విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ కుమార్ హెచ్చరించారు. గురువారం మండలంలోని గుడుపల్లె, రైల్వే స్టేషన్ క్రాస్, అగరం క్రాస్, కుప్పిగానిపల్లె, యామగానిపల్లె , కనమనపల్లె గ్రామాలలోని దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఇకపై దుకాణాలలో పెట్రోల్, డీజిల్ ఉన్నట్లు తెలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు ఫయాజ్, శ్రీనివాస్‌గౌడు, శివమ్మ, హరి పాల్గొన్నారు.

మండలాలకు చేరుతున్న పాఠ్య పుస్తకాలు

పుంగనూరు: పాఠశాలలు ప్రారంభం కాగానే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గురువారం మండలానికి 2,700 పుస్తకాలు చేరాయి. 9, 10 తరగతులతో పాటు ఇంటర్మీడియెట్ విద్యార్థుల కోసం ఎక్స్‌ట్రా కర్రికులం పుస్తకాలు అందాయి. రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు అందుతాయని, మండల వ్యాప్తంగా 139 పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేయనున్నట్టు ఎంఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.



పుంగనూరుకు చేరిన పాఠ్య పుస్తకాలు

కస్తూర్బా స్కూల్‌లో ఎంఈసీ గ్రూపు ఎత్తివేత

- అడ్మిషన్ల సంఖ్య తగ్గడమే కారణం

గుడుపల్లె: కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియెట్‌లోని ఎంఈసీ గ్రూపులో ఎత్తివేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ మాధవి గురువారం తెలిపారు. ఈ గ్రూపులో బాలికలు ఎక్కువగా చేరకపోవడంతో ఎంఈసీ నుంచి సీఈసీ గ్రూపుగా మార్చినట్లు చెప్పారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల కోసం కస్తూర్బా గురుకుల పాఠశాలలో ఎంఈసీ గ్రూపు బదులుగా సీఈసీ గ్రూపులో చేరాలన్నారు.

అదుపు తప్పిన బైక్ మోటార్ సైక్లిస్టుకు గాయాలు

పుంగనూరు: మద్యం మత్తులో ఓ మోటార్ సైక్లిస్టు రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలైన సంఘటన గురువారం ఉదయం పుంగనూరు సమీపంలోని కత్తార్లపల్లె వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. చౌడేపల్లె మండలం బి.కదిరేపల్లెకు చెందిన యోగానంద (33) మద్యం మత్తులో మోటార్ సైకిల్‌లో పుంగనూరుకు వస్తూ ప్రమాదానికి గురయ్యాడు. బైక్ అదుపు తప్పి కింద పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. అతడిని గమనించిన కొందరు సమాచారం ఇవ్వడంతో 108 అక్కడికి చేరుకుంది. అతడిని అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్యాణం.. కమనీయం



పట్టువస్త్రాలను సమర్పిస్తున్న పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి

సదుం: మండలంలోని బూరగమంద భూదేవీ శ్రీదేవీ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. కల్యాణోత్సవం పురస్కరించుకుని స్వామి వారికి వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఉత్సవమూర్తులను మనోహరంగా అలంకరించి, వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం గరుడ వాహనంపై స్వామి వారు మేళతాళాలు, మంగళవాయిద్యాల హోరు నడుమ గ్రామంలో విహరించారు. భక్తులు స్వామి వారికి కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ, మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, అర్చకులు శేషగిరి, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

25న కంటి వైద్య శిబిరం

పుంగనూరు: పట్టణంలో తాటిమాకులపాళెంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఈ నెల 25న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నామని అసోసియేషన్ నాయకులు మునస్వామి మొదలియార్ గురువారం తెలిపారు. ఉదయం 9 గంటలకు శిబిరాన్ని చెన్నైకు చెందిన శంకర్ నేత్రాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తామని, కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రమణీయం..రథోత్సవం



గంగవరం: రథోత్సవంలో విహరిస్తున్న కోనేటిరాయుడు

- అశ్వ వాహనంపై శ్రీవారి విహారం
- నేడు చక్రస్నానం, ధ్వజారోహణం

గంగవరం: మండలంలోని టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో 8వ రోజు గురువారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేతంగా కోనేటిరాయుడు మహారథంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించిన భక్తులు గోవింద నామస్మరణతో పులకించారు. శ్రీవారి రథం ముందు భక్తజన బృందాలు, చెక్క భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ రథోత్సవం కోలాహలంగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో శ్రీవారి రథాన్ని లాగి పునీతులయ్యారు. అంతకుముందు తొలుత ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, తోమాల సేవ, అర్చన, అభిషేకం..ఇత్యాది కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీవారు దేవేరి సమేతంగా వేంచేసి ఉయ్యాలపై సేదదీరారు. రాత్రి స్వామివారు అశ్వవాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. స్వామి అశ్వ వాహనాధిరుడై భక్తులకు దర్శనమిస్తే కలిదోషాలు నశిస్తాయని భక్తుల నమ్మకం. వాహన సేవ ఎదుట భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కంకణబట్టార్ ఏకే. నరసింహాచార్యులు, డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లె: ఆలయం వద్ద రథాన్ని లాగుతున్న భక్తులు

బ్రహ్మోత్సవాలలో నేడు

శుక్రవారం ఉదయం తిరుచ్చి ఉత్సవం, చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు. శ్రీవారి పుష్పయాగంతో కోనేటిరాయుని బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి.



గంగవరం: అశ్వ వాహనంలో శ్రీవారి విహారం

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: మండలంలో బేలుపల్లె సమీపంలోని పట్నంకొండపై ఉన్న శ్రీ కళ్యాణ వెంకట్రమణస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం రమణీయంగా సాగింది. రంగు రంగుల పుష్పాలతో అలంకరించిన బ్రహ్మరథంపై శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకట్రమణ స్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. భక్తులు రథాన్ని లాగేందుకు పోటీ పడ్డారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

కిరోసిన్ దీపం నుంచి.. కరెంటు వెలుగు వైపు..!

- దాత వితరణతో ఓ పేద కుటుంబ ఇంట తొలగిన అంధకారం



ఇంటి ముందు విద్యుత్ మీటర్



జ్యోతమ్మ ఇంట్లో కరెంట్ వెలుగులు

పలమనేరు: పేదరికం కారణంగా ఇంటికి విద్యుత్ సర్వీసు తీసుకోలేక కిరోసిన్ బుడ్డీ వెలుగులోనే జీవితం సాగిస్తున్న ఆ కుటుంబం ఇంట ఓ స్వచ్ఛంద సంస్థ వెలుగులు నింపింది. వివరాలు.. గంగవరం మండలం సరమట్లపల్లెకు చెందిన జ్యోతమ్మ కుటుంబం కూలి పనులపై ఆధారపడి జీవిస్తోంది. ఓ మట్టిగోడతో నిర్మించిన రేకుల షెడ్డులో ఆ కుటుంబం నివసిస్తోంది. ఆ ఇంటికి కరెంట్ సర్వీసు కూడా లేదు. ఇంతకాలమూ రాత్రి పూట కిరోసిన్ దీపం గుడ్డి వెలుతురులోనే ఆ కుటుంబం ఉండేది. ఇది తెలుసుకున్న గ్రామస్తులు బాబు, అశోక్, లక్ష్మి సర్వీస్ టు సొసైటీ అనే స్వచ్ఛంద సంస్థ దృష్టికి తీసుకెళ్లడంతో ఆ సంస్థ స్పందించింది. విద్యుత్ కనెక్షన్ కోసం అవసరమైన నగదు సాయం చేసింది. దీంతో విద్యుత్ మీటర్, మెయిన్ స్విచ్, హోల్డర్లు, ట్యూబ్‌లైట్, 60 వాట్స్ బల్బులను అమర్చి ఆ ఇంట్లో వెలుగులు నింపింది. దాత అశోక్ ఆలమట్టికి జ్యోతమ్మ కృతజ్ఞతలు తెలిపింది.